నిరుపయోగంగా జేఎన్ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లు

- 15 బ్లాకులు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కేటాయింపులు శూన్యం
- మొత్తం 480 ఫ్లాట్ల తలుపులు, కిటికీలు మాయం
- కిటికీలకు అమర్చిన అద్దాలను పగులకొట్టిన వైనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నూతన బ్లాకులు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు, పోలీసులు



నూతనంగా నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్‌ఎం బ్లాకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగర శివారులో ఉన్న వైఎస్సార్ కాలనీలో సుమారు నాలుగేళ్ల క్రితం జేఎన్ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద నగరపాలక సంస్థ 15 బ్లాకులను నిర్మించింది. ఒక్కో బ్లాక్‌కు 32 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 ఫ్లాట్లు నిర్మించింది. అయితే అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. బ్లాకుల చుట్టూ ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలతో నిర్మానుష్యంగా ఉండటంతో అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే నిర్మించిన నూతన బ్లాకుల ప్రాంతాన్ని కొందరు బహిర్భూమిగా వాడుకుంటున్నారు. కాలనీలోని వేర్వేరు బ్లాకుల్లో నివసిస్తూ చదువులు మానేసి గాలికి తిరుగుతున్న యువకులు పగలు, రాత్రి తేడా లేకుండా నూతన బ్లాకుల ప్రాంతంలో హల్‌చల్ చేస్తున్నారు. జనసంచారం లేని కొత్త బ్లాకుల ఏరియాలో మద్యం, మత్తు పదార్థాలు తీసుకుంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నూతన బ్లాకులకు ఒక వైపు చెరువు, మరో వైపు రైలు కట్ట ఉండటంతో చీకటి పడితే అటువైపునకు ఎవరూ వచ్చే పరిస్థితి లేకపోవడం, సెక్యూరిటీ గార్డ్స్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఆకతాయిలకు ఇష్టారాజ్యం అయిపోయింది. ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురు తిరగడం, దాడులు చేయడం పరిపాటిగా మారింది.

తలుపులు, కిటికీలు మాయం

నూతనంగా నిర్మించిన 15 బ్లాకులలోని 480 ఫ్లాట్లను ఎవరికీ కేటాయించకపోవడంతో మద్యం, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారు. డబ్బు అవసరమైనప్పుడల్లా ఫ్లాట్స్‌కు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలు ఎత్తుకుపోయి అమ్ముకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా కిటికీలకు అమర్చిన అద్దాలను పగులకొట్టి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడేస్తున్నారు. డ్రెయినేజి పైపులను పగులకొట్టారు. ప్రతి బ్లాక్ గ్రౌండ్



ఒక బ్లాకు గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్‌లో మాయమైన తలుపులు, కిటికీలు

ఫ్లోర్‌లో 32 ఫ్లాట్లకు సంబంధించి విద్యుత్ మీటర్లను బిగించేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ బాక్స్‌లు కొన్ని మాయం కాగా మరి కొన్ని బ్లాక్ ముందు పడేసి ఉన్నాయి. సమయం చూసి వాటినీ ఎత్తుకుపోయి తమ అవసరాల (గంజాయి, మద్యం) నిమిత్తం అమ్ముకుంటున్నారని స్థానికులు అంటున్నారు. వైఎస్సార్ కాలనీ ప్రాంతం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా పోలీసులు అప్పుడప్పుడు వచ్చి కొత్త బ్లాకుల వైపు గస్తీ తిరుగుతున్నారు. అయినా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు షరా మామూలుగానే వ్యవహరిస్తున్నారు. ఫ్లాట్లను లబ్ధిదారులకు కేటాయిస్తే జన సంచారం ఉంటుందని, అప్పుడు ఆకతాయిలు ఇక్కడికి చేరే అవకాశం ఉండదని పోలీసులు అంటున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం

విజయవాడ నగరంలో కాలువగట్లపై నివసించే నిరుపేద ప్రజలు, కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఉంటున్న వారి ఇళ్లను తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఫ్లాట్లు కేటాయిస్తూ వస్తోంది నగరపాలక సంస్థ. అటువంటి వారి కోసం నూతనంగా నిర్మించిన 15 బ్లాకులను ఎవరికీ కేటాయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. లబ్ధిదారులు లేరా అంటే.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు తొలగించిన పేదవారు అనేక మంది ఉన్నారు. అటువంటి వారంతా నిత్యం కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ కనిపిస్తూనే ఉంటారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి పేదల కోసం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడం తమకు బాధగానే ఉందని, ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే తాము మాత్రం ఏం చేయగలమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

క్లుప్తంగా

నగరంలో రాచరికం చిత్రం యూనిట్ సందండి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాచరికం చిత్ర యూనిట్ శనివారం విజయవాడ నగరంలో సందడి చేసింది. మొగల్రాజపురంలోని జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న ఒక హోటల్లో ఆ చిత్రం యూనిట్ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. చిత్ర హీరో విజయ్‌శేఖర్ మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంలో రాచరికం చిత్రాన్ని నిర్మించామన్నారు. హ్యాపీడేస్ సినిమాలో హీరోగా నటించిన వరుణ్ సందేశ్ ఈ సినిమాలో విలన్ పాత్రలో మొదటిసారిగా నటిస్తున్నారని, ఆయన నటన చిత్రానికి హైలెట్‌గా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా అప్సర రాణి నటించిందని, ఆమె నటన ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. హీరోయిన్ అప్సర రాణి మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనంతో విజయవాడ నగరంలో రాచరికం సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా ఉంటుందని అన్నారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుందని తెలిపారు. దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ అంటే ఏంటి, ఆ రోజుల్లో ఆ వ్యవస్థ ఎలా ఉండేదనే అంశాలను ఈ చిత్రం ద్వారా నేటి తరానికి తెలియజేస్తున్నామని చెప్పారు. కామెడీ, లవ్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని అన్నారు. చిత్ర నిర్మాతలు ఈశ్వర్, చాణిక్య పాల్గొన్నారు.

రాజశ్యామలాదేవి అలంకారంలో కాళీమాత అమ్మవారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో మాఘ మాసం సందర్భంగా ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు కాళీమాత అమ్మవారు రాజశ్యామలా దేవిగా దర్శనమిస్తారని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 8 రోజుల పాటు రాజశ్యామలా దేవి హోమం జరుగుతుందన్నారు. భక్తులు రాజశ్యామలా దేవి రూపంలో ఉన్న కాళీమాత అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఫిబ్రవరి 3వ తేదీ పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు ఉషా ఛాయ పద్మినీ సమేత సూర్య నారాయణ స్వామికి అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు జరుగుతాయన్నారు. వివరాలకు దేవస్థానం కార్యాలయంలో గాని, 98482 90663 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

డేవిడ్ జాన్సన్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేసేవారికి ఏ రంగంలో ఉన్నా తగిన గుర్తింపు లభిస్తుందనడానికి పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 149 వార్డు సచివాలయ అభివృద్ధి, సంక్షేమ కార్యదర్శి డేవిడ్ జాన్సన్ నిదర్శనంగా నిలిచారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బూత్ లెవెల్ ఆఫీసర్‌గా హోమ్ ఓటింగ్, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, ఓట్ల లెక్కింపులో అంకిత భావంతో నిర్వహించిన బాధ్యతలకు గాను ఆయనకు ఈ అవార్డు లభించింది.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

పున్నమి ఘాట్‌లో ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన



పున్నమిఘాట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్లాస్టిక్ వాడకం వలన ఏర్పడే కాలుష్యంపై భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో గల పున్నమి ఘాట్ వద్ద అవగాహన కార్యక్రమం జరిగింది. కియా సోషల్ కంట్రిబ్యూషన్‌లో భాగంగా 'క్లీన్ – అప్ డ్రైవ్' (అండర్ ప్రాజెక్ట్ డీఆర్‌ఓపీ) పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కియా మోటార్స్ సీఈఓ రాష్య, సీనియర్ మేనేజర్ మారుతి, స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, ఏపీటీడీసీ డీఈ శ్రీనివాస్ యాదవ్, ప్రజాపతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్య ప్రభావానికి గురైన రొయ్యలు, చేపలు తదితర సముద్ర ఆహార ఉత్పత్తులు వినియోగించడం వలన మనుషుల హార్మోన్లపై ప్రభావం చూపుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు కృష్ణానది తీరంలో పున్నమిఘాట్ వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి వేసి శుభ్రం చేశారు.

న్యాయస్థానాల్లో రాజకీయ జోక్యం వద్దు

ఐఏఎల్ డిమాండ్



ఐఏఎల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల కాలంలో అసలు ఎవరో, నకిలీ ఎవరో అర్థం కానటువంటి పరిస్థితి ఉందని, న్యాయస్థానాల్లో నకిలీ న్యాయవాదుల హవా ఎక్కువై రాజకీయ జోక్యం పెరిగిందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ అన్నారు. అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం శనివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా హైకోర్టు బెంచి ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన యువ న్యాయవాదులకు ఇస్తున్న గౌరవ వేతనం లా నేస్తం పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఆర్థిక అవసరాల కోసం బ్యాంకుల్లో అప్పులు చేసే బదులుగా న్యాయస్థానంలోనే పరస్పర సహకార బ్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సుప్రీం, హైకోర్టుల్లో సీసీ కెమెరాలు, ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. హక్కుల కోసం పోరాడే వారిపై నిర్బంధాలు విధించడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ సురేష్‌కుమార్, వి.చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని వాసవ్య మహిళా మండలి కార్యనిర్వాహక బోర్డు సభ్యురాలు పి.సుభాషిణి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డేటా సైన్స్ విభాగం, ఉమెన్ ఆఫ్ వర్త్ విభాగాల ఆధ్వర్యంలో ''డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ప్రాముఖ్యత'' అంశంపై సదస్సును కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన సుభాషిణి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరచుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ దాడుల నుంచి ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్ల అంశం చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగిస్తున్న సెల్‌ఫోన్ల ద్వారా వ్యక్తిగత సమాచారం బయటకు వెళ్లేందుకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగ కోఆర్డినేటర్ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి వాసవీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ వాసవీ ఫౌండేషన్, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, వివిధ ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకూ వాసవీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు చెప్పారు. పాతబస్తీలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో శనివారం ఆహ్వానపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు ఆధ్వర్యంలో గడిచిన 25 సంవత్సరాలుగా వాసవీ జయంతి, వాసవీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది రజతోత్సవాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 27న వాసవీ మూలమంత్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, 28న అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ హోమం, 29న మృత్యుంజయ పాశుపత హోమం, 30న వాసవీ వ్రతాలు, 31న అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, అమ్మవారి మోక్షగుండ సందర్శనం హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు వీవీకే నరసింహారావు, కొణిజేటి రమేష్, డోగిపర్తి శంకరరావు, నంబూరి ప్రదీప్, సీఎల్ అరుణ్, కె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పెనుగొండ సుబ్బరాయుడు

రక్తదానం ప్రాణదానంతో సమానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసి ప్రాణ దాతలుగా మారాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ గద్దే శేషగిరిరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో ఐడీఏలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ద్వారా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఓటు హక్కుపై అందరికీ అవగాహన అవసరం

పటమట(విజయవాడతూర్పు): ఓటు హక్కుపై అందరికీ అవగాహన కల్పించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద కార్పొరేషన్ సిబ్బందితో జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు వేయడం అందరి బాధ్యతని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ యువ ఓటర్లుగా వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజినీర్ వర్క్స్ పి.సత్యనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, మేనేజర్ ఏయూబీ శర్మ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సిబ్బందితో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

ఓటు ప్రతి పౌరుడి హక్కు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రతి పౌరుడి హక్కు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఓటు హక్కుపై ఆమె అవగాహన కలిగించారు. కుల, మత, జాతి వివక్ష లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ మోతీబాబు, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహసమీర, డాక్టర్ బాలాజీ, గణాంక అధికారి లక్ష్మాజీ, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

స్టెల్లా కళాశాలలో...

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్టెల్లా కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఓటరు నమోదుతో పాటు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ లిన క్వాడ్రస్ మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడాలంటే నిబద్ధతతో కూడిన నాయకులుండాలనే ధ్యేయంతో ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాల నుంచి నిర్మల కాన్వెంట్ వరకు సర్వీస్‌రోడ్డులో ఓటు చైతన్యంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సిస్టర్ రేఖ, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి సూరయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రజల చేతిలో ఆయుధం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజాస్వామ్య దేశంలో ఉత్తమ ప్రభుత్వం ఏర్పడాలంటే ప్రజలు తమ ఆయుధమైన ఓటుహక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, ప్రజ్ఞ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడంలో చదువుకున్న వారు కూడా అలసత్వం వహించడం అనేక దుష్ప్రభావాలకు దారితీస్తోందన్నారు. ఓటు వేయడం భారంగా కాకుండా బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఓటు వేయటంలో నిర్లక్ష్యం వహించడం లేదా ఓటును సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల కలిగే నష్టాలకు ప్రజలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త ఎస్.సాంబశివరావు, ప్రజ్ఞ క్లబ్ సమన్వయకర్త వై.నాగరాజు ఓటుహక్కుపై ప్రమాణం చేయించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. 'ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత' అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.




పాఠకులు, సిబ్బందితో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్

ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతం ఓటు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, పద్దెనిమిదేళ్లు నిండిన యువత తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయ అధికారి సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. గ్రంథాలయంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ 1950లో భారత ఎన్నికల సంఘం (ఏసీఐ) స్థాపించిన రోజుకు గుర్తుగా 2011 నుంచి కేంద్ర ప్రభుత్వం ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నందున వారు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఒక దేశం యొక్క భవిష్యత్తు ఓటు హక్కుపై ఆధారపడి ఉంటుందని, కుల, మత, ప్రాంత, లింగ, జాతి భేదం లేకుండా పద్దెనిమిదేళ్లు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాఠకులు, గ్రంథాలయ సిబ్బందితో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం యువతకు జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రాముఖ్యత అనే అంశంపై చర్చా పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు



జాతీయ జెండా రంగుల విద్యుత్ లైట్లలో బాపు మ్యూజియం



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు లైటింగ్



విద్యుత్‌కాంతి వెలుగుల్లో ఆర్‌అండ్‌బీ భవనం

గణతంత్ర దిన వేడుకలను పురస్కరించుకుని విజయవాడలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాపూజీ మ్యూజియం, కలెక్టరేట్, సబ్‌కలెక్టర్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, పలు శాఖల కార్యాలయాలను అందంగా అలంకరించారు. అలాగే బందరు రోడ్డు డివైడర్‌కు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఓటు హక్కుపై చైతన్య స్ఫూర్తి









జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఓటు హక్కుపై నగర ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ర్యాలీ నిర్వహించారు. పాత గవర్నమెంట్ ఆసుపత్రి నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు సాగిన ఈ ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుతో పాటు పలువురు అధికారులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవంను ఉద్దేశిస్తూ వేసిన రంగోళి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ